క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నోమా సబ్‌స్టేషన్ 11 కేవీ నర్సింహనగర్ ఫీడర్ పరిధిలోని చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ క్రిష్టయ్య తెలిపారు. ఎన్టీఆర్ నగర్, నర్సింహనగర్, లక్ష్మీ నగర్, శాంతి నగర్, మీర్‌పేట్, అంజనా టవర్, తదితర కాలనీలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

11 కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో...

లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో లక్ష్మీనర్సింహానగర్, మైప్లవర్, గ్రాండ్,, మ్‌లెవ్లర్ ప్లానిమం, బీరప్ప గడ్డ, సాయిగార్డెన్, మల్లాపూర్ విలేజ్ తదితర ప్రాంతాల మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నాచారంలో...

నాచారం వైజయంతి 11 కేవీ ఇండోర్ స్టేడియం ఫీడర్ పరిధిలో బాబా నగర్, రవీంద్రనగర్, రాఘవేంద్రనగర్, దుర్గానగర్, కార్తికేయనగర్ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు.

కుషాయిగూడలో...

చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు పీడర్ల పరిధిలో కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సీహెచ్.అర్చన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మారుతీనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని ప్రగతినగర్, మారుతీనగర్, ఎంఐజీ-బీ, ఎల్ఐజీ-బీ, క్రియోటివ్‌నగర్, సాయినాథపురం కాలనీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మసీద్ ఫీడర్ పరిధిలోని మారుతీనగర్, క్రామికనగర్ కాలనీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు ఉండదని ఆమె తెలిపారు.

ఇంటింటా త్రివర్ణ పతాకం ఎగురవేయాలి



రామంతాపూర్: హర్ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కార్పొరేటర్ బండారుశ్రీవాణి వెంకట్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజాద్ ఇక అమృత్ కార్యక్రమంలో భాగంగా 15 ఆగస్టు స్వాతంత్ర దినోత్సవం రోజున ప్రతి ఇంటింటి జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు డివిజన్‌లోని ప్రతి ఇంటింటా జాతీయ పతాకాలు ఎగురవేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ ఉప నియోజకవర్గం ఇన్‌చార్జి బాలచందర్, డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకటరావు, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చేతన

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ పీఅండ్‌టీ కాలనీలో శుక్రవారం మంచినీటి పైపులైన్ పనులను కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హబ్సిగూడ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాలనీలో తాగునీరు కలుషిత జలాలు సరఫరా కావడంతో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా అధికారులతో మాట్లాడి నూతన పైపులైన్ పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు ఆసీఫ్ అలీ, బీజేపీ నాయకులు బొమ్మగోని కైలాష్‌పతిగౌడ్, సంజయ్‌పటేల్, అల్కాపురి సురేష్, కట్ట భాస్కర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించండి



గుర్రపు డెక్క తొలగింపు పనులు పరిశీలించిన కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువులో గుర్రపుడెక్క పూర్తిగా తొలగించడానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. శుక్రవారం ఎంటమాలజీ విభాగం అధికారులతో కలిసి గుర్రపు డెక్క తొలగించే పనులను ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఎఫ్‌టీసీ మిషన్ ద్వారా 90 శాతం గుర్రపు డెక్క తొలగించినప్పటికీ కొన్ని చోట్ల వదిలివేయడం వలన తిరిగి పెరిగే అవకాశం ఉందని, దాన్ని కూడా తొలగించాలని సూచించామన్నారు. కార్యక్రమంలో మల్లేష్, శరత్‌యాదవ్, నందుయాదవ్, సంతోష్, మురళీగౌడ్ రామ్, వినోద్ యాదవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి



హబ్సిగూడలో పాదయాత్ర చేస్తూ సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: మీ కోసం – మీ ఎమ్మెల్యే పాదయాత్రలో భాగంగా శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బేతి స్వప్నరెడ్డితో కలిసి హబ్సిగూడ డివిజన్ పరిధిలోని వెంకట్ రెడ్డినగర్, కామాక్షిపురం, వాసవీనగర్, రాంరెడ్డి నగర్ కాలనీల్లో ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుంటూ ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు, యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా కాలనీల్లో పర్యటించిన నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కాలనీల సమస్యలను తెలుసుకుంటూ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపాలని ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కాలనీల్లో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు, బోర్‌వెల్స్ మరమ్మతులు, విద్యుత్ దీపాల ఏర్పాటు, రోడ్లు, మ్యాన్‌హోల్స్ ప్యాచ్‌వర్క్స్ తదితర సమస్యలు అధికారులతో మాట్లాడి పరిష్కారం లభించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రవీందర్, మాజీ కార్పొరేటర్ ధన్‌పాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మనోహర్, భాస్కర్ ముదిరాజ్, నరేష్ ముదిరాజ్, రవీందర్‌రెడ్డి, డాక్టర్ బీవీ.చారి, సోమిరెడ్డి, మహేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, గిరిబాబు, ముత్యంరెడ్డి, నర్సింగ్‌రావు, ముస్తాక్, వనంపల్లి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న దుర్గానగర్ కాలనీవాసులు

సీసీ రోడ్డు వేయాలని వినతి

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్డు వేయాలని కోరుతూ శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డికి కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు కాలనీవాసులు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో సర్వేశ్, శ్రీనివాస్, ఎండీ అన్వర్, అఫ్జల్, ముస్తఫ్, ఖముద్దీన్, ఫక్రుద్దీన్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని సెలెక్ట్ టాకీస్ హనుమాన్ టెకిడి పరిసర ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థపై నివాసితులతో చర్చించారు. వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఈ మహేష్, కాలనీవాసులు జయచంద్రారెడ్డి, మల్లేష్, నరసింహ, ఎల్లయ్య, గణేష్, వెంకట రాములు, నర్సింగ్, స్థానిక నాయకులు శ్రీశైలం యాదవ్, పుట్నాల కృష్ణ, శోభన్, వెంకటేష్ గౌడ్, వివిరావు, సులోచన తదితరులు పాల్గొన్నారు.



మచ్చబొల్లారం డివిజన్ సెలెక్ట్ టాకీస్ హనుమాన్ టెకిడి ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

క్షేత్రస్థాయిలో పర్యటించిన సీడీఎంఏ సత్పతి

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని క్షేత్రస్థాయిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పమేల సత్పతి పర్యటించారు. బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి, కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డితో కలిసి నూతనంగా నిర్మిస్తున్న సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం పురోగతిని పరిశీలించారు. సదరు నిర్మాణ పనులను గుత్తేదారు ద్వారా త్వరతిగతిన పూర్తిచేయాలని కోరారు. అనంతరం తల్లిదండ్రులను కోల్పోయి సంరక్షకుల సహాయం ద్వారా ఉన్న అనాథల సంఖ్య, వివరాలు ఆన్‌లైన్ ద్వారా గుర్తించే సర్వే, జరిగే రీతిని 24వ డివిజన్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డీఈఈ బాలమురళి, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి, నేతలు గుర్రాల వెంకటేశ్‌యాదవ్, మోదుగు శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమీకృత మార్కెట్ నిర్మాణ వివరాలను తెలుసుకుంటున్న సత్పతి

ర్యాగింగ్ రహిత అనురాగ్ యూనివర్సిటీకి కృషి చేయాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్, డీసీపీ జానకి

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

ఘట్‌కేసర్: అనురాగ్ యూనివర్సిటీని ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా మార్చడానికి విద్యార్థులు కృషి చేయాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ)లో ర్యాగింగ్, డ్రగ్స్ నిర్మూలనపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు సీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ర్యాగింగ్, డ్రగ్స్ వాడకం, ఈవ్ టీజింగ్, ధూమపానం వంటి దురలవాట్లకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేస్తుందని అన్నారు. యువత ఇంటర్నెట్, సోషల్ మీడియా, అపరిచిత వ్యక్తులతో దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు కుటుంబ సభ్యులతో అధిక సమయం వెచ్చించాలని, తమ సమస్యలు పాలుపంచుకోవాలన్నారు. ఏయూ చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్ వంటి హీనమైన చర్యలకు పాల్పడకుండా కెరీర్‌పై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో మల్కాజ్‌గిరి డీసీపీ జానకి, ఏసీపీ నరేశ్‌రెడ్డి, సీఈఓ నీలిమా, రిజిస్ట్రార్, హెచ్ఓడీలు విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీలక్ష్మీ సుదర్శన యజ్ఞం



అల్వాల్: అల్వాల్‌లోని శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీలక్ష్మీ సుదర్శన మహాయజ్ఞం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచర్ ఆధ్వర్యంలో జరిగిన మహాయజ్ఞంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని ఆలయ ఈఓఎం వీరేశం తెలిపారు.

కొనసాగుతున్న సెలక్షన్స్

శామీర్‌పేట్: తూముకుంట మున్సిపాలిటీ పరిధి హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి సెలక్షన్స్ కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతి ప్రవేశాలకు శుక్రవారం విద్యార్థులకు ఫిజికల్, మెడికల్ టెస్టులు నిర్వహించారు. సెలక్షన్స్‌లో నల్గొండ, భువనగిరి-యాద్రాద్రి, సూర్యాపేట్, జనగాం జోన్ల విద్యార్థులు పాల్గొన్నట్లు ఓఎస్‌డీ వివరించారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



సీసీ రోడ్డు నిర్మాణపనులను పరిశీలించిన కార్పొరేటర్

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ అనంతసరస్వతీనగర్ కాలనీలో రూ.96 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ యూజీడీ, మంచినీటి పైపులైన్ పనులు పూర్తయిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వీఐ రజనీకాంత్, బాబు, సత్యనారాయణ, ప్రభాకర్‌గౌడ్, హరీష్, జంగయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు

అల్వాల్: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మేరీ మాటీ.. మేరీ దేశ్ కార్యక్రమం నిర్వహించాలని బీజేపీ కేంద్ర శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా నేరేడ్‌మెట్‌లోని ఆర్‌కేపురం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. చేతిలో మట్టితో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు సత్యనారాయణబాబు, ఆర్‌కే. శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ వికే. మహేష్, నాయకులు జీకే. హన్మంతరావు, రమేష్‌గౌడ్, సుధాకర్, మల్లేష్, జనార్దన్, శంకర్ రావు తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ వద్ద బీజేవైఎం ఆందోళన

సాక్షి, మేడ్చల్ జిల్లా: ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఎన్నికల్లో యువతకు హామీ ఇచ్చిన ప్రకారం నిరుద్యోగ భృతి ప్రతినెలా రూ.3,016 చొప్పున ఇప్పటి వరకు 56 నెలలకు సంబంధించిన మొత్తం రూ.1,68,896 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట బీజేవైఎం కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. గ్రూపు-2 పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. వందలాది మంది ప్రాణత్యాగం చేసి సాధించుకున్న స్వరాష్ట్రంలో 10 ఏళ్లు అవుతున్నా, ఉద్యోగ నియామకాలు లేకపోవడంతో నిరుద్యోగ యువత ఆవేదన చెందుతుందన్నారు. నోటిఫికేషన్ల జారీ మొదలు కొని పరీక్షలు నిర్వహిస్తున్న తీరుతోపాటు ఉద్యోగ నియామకాలన్ని తప్పుల తడక కొనసాగుతున్నాయని బీజేవైఎం కార్యకర్తలు ఆరోపించారు. దీంతో నిరుద్యోగ యువత తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని బీజేవైఎం కార్యకర్తలు ఆందోళనలో వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌ను సస్పెండ్ చేసి, అభ్యర్థుల కోరిక మేరకు గ్రూప్-2 పరీక్షలకు 3 నెలల గడువిచ్చి, ఎలాంటి లీకులు, తప్పులు లేకుండా నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ వద్ద బీజేవైఎం ధర్నా, బైఠాయింపుతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. శామీర్‌పేట పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పారు. బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు పటోళ్ల విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు భానుప్రకాష్, జిల్లా అధ్యక్షుడు, పవన్‌రెడ్డి, నాయకులు చల్ల ప్రభాకర్, చిత్తరంజన్‌రెడ్డి, శివ, సంతోష్, సునేముంతల రవీందర్‌గౌడ్, నల్ల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. బోడుప్పల్ 3, 28 డివిజన్‌ల్లో శుక్రవారం ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో మొక్కలను పెంచి కాలుష్యం లేకుండా చూసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో బోడుప్పల్ హరిత వనంగా మారనున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం 3వ డివిజన్‌లో ఓటర్ నమోదు కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, చీరాల నర్సింహ్మా, కోఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు పార్టీల ప్రజాప్రతినిధులతో అవస్థలు



ఓల్డ్ సఫిల్‌గూడలో జరుగుతున్న అభివృద్ధి పనులు

విజ్ఞాన్ ఆర్కేడ్ వెల్ఫేర్ అసోషియేషన్ కమిటీ సభ్యులు

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలో మూడు పార్టీల ప్రజాప్రతినిధులతో ప్రజలు అయోమయంలో ఉన్నారని ఓల్డ్ సఫిల్‌గూడ విజ్ఞాన్ ఆర్కేడ్ వెల్ఫేర్ అసోషియేషన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం ఓల్డ్ సఫిల్‌గూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి, మల్కాజిగిరి ఎమ్మెల్యే బీఆర్ఎస్ వ్యక్తి, డివిజన్ కార్పొరేటర్ బీజేపీకి చెందిన వ్యక్తి అన్నారు. ముగ్గులు ప్రజాప్రతినిధులు వేర్వేరు పార్టీలకు చెందిన వారు కావడంతో అభివృద్ధిలో ప్రజలు పడరాని గోస పడుతున్నారన్నారు. గతంలో సుమేద బాలిక ఘటన తర్వాత వర్షం నీరు సజావుగా పోవడానికి బాక్స్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని పలుమార్లు జీహెచ్ఎంసీకి సమర్పించినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరం అన్నారు. గురువారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు శంకుస్థాపనకు నాలుగు అడుగుల వెడల్పు ఉన్న పైపులపు తీసుకొచ్చి తవ్వకాలు చేయడం సరికాదని విజ్ఞాన్ అర్కేడ్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు తెలిపారు. వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని జరుగుతున్న పనులకు మౌలాలి డివిజన్ కార్పొరేటర్ వచ్చి కొబ్బరికాయ కొట్టడం కూడా విడ్డూరంగా ఉందన్నారు. ఇక్కడ పార్టీల ప్రతినిధులలో సఖ్యత లేక ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని గతంలో నీరు సజావుగా పోవడానికి 70-30 వాటాతో నాలా ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పుడు బాక్స్ డ్రైనేజీ కాకుండా నాలుగు అడుగుల పైపులైన్‌లు వేస్తే అపార్ట్‌మెంట్‌కు ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పేర్కొన్నారు. మున్సిపాల్ ఏఈ, టౌన్‌ప్లానింగ్ అధికారులు, నేరేడ్‌మెట్ సీఐ నాగరాజు, అపార్ట్‌మెంట్‌కు రక్షణగోడ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేష్, వీకే.మహేష్, దత్తు, పూలపల్లి రాముయాదవ్, రామచంద్రరావు, భిక్షపతి, సుజ్ఞాదం, మూర్తి, నరసింహచారి, శరత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి



ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శిస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని 18వ డివిజన్ కార్పొరేటర్ పులకండ్ల హేమలతా జంగారెడ్డి అన్నారు. 18వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. సవరణలు, పేరు, అడ్రస్ మార్పులు ఆన్‌లైన్ ద్వారా చేయించుకోవాలని ఓటర్లను ఆమె కోరారు. డివిజన్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పులకండ్ల జంగారెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి రవికాంత్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు ప్రభాకర్, రమేష్‌కుమార్, గడ్డం నరేంద్రకుమార్, బాల్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో...

మల్కాజిగిరి: ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలని ప్రశాంత్‌నగర్ పోలింగ్ బూత్ సూపర్‌వైజర్ తుల్జాసింగ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం పోలింగ్ బూత్ వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో ఓటర్లు వారి పేర్లను పరిశీలించుకున్నారు. అనంతరం మార్పులు చేర్పుల కోసం, నూతన ఓటర్ల కోసం దరఖాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు రాము, రూప, హేమలత, కాలనీ అధ్యక్షుడు సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్‌లో ఓటరు నమోదు కార్యక్రమం